క్లుప్తంగా

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఏడీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరు క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్, రమేష్, మర్రి కృష్ణ, ఐబీ చారి, సైదులు, నరేష్, చంటి పాల్గొన్నారు.

విరాళం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి కొత్తగూడేనికి చెందిన జగపతిరావు, జయలక్ష్మి దంపతులు రూ.20,511, ఏపీ రాష్ట్రం విజయవాడకు చెందిన శ్రీసాల వెంకట్ అరవింద్ గోపాల్, హర్షిత దంపతులు రూ.5,116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు.

యూనిఫాం వితరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ పరిధిలోని గంగమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని 25 మంది పిల్లలకు రెండు జతల చొప్పున యూనిఫాం క్లాత్, స్టిచ్చింగ్ చార్జీలను విజయవాడ హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ ఆదివారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, పిల్లలు, తల్లులు మడకం సోని, చుక్కి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎంప్లాయీస్ కమిటీ ఎన్నిక


జయరాజు


ఆవుల కృష్ణారెడ్డి

పాల్వంచ: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ 82) జెన్‌కో అధ్యక్షుడిగా కేటీపీఎస్‌కు చెందిన ఉండేటి జయరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆవుల కృష్ణారెడ్డి నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్ మేడ్చల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సౌకత్ పాషా, ప్రధాన కార్యదర్శిగా జలీల్ పాషా ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ అధ్యక్షుడిగా చిలువేరు మల్లయ్య (కేటీపీపీ), ఉపాధ్యక్షుడిగా వేల్పుల రాంబాబు (పులిచింతల హైడల్ ప్లాంట్), జాయింట్ సెక్రటరీగా అంజయ్య (శ్రీశైలం)లను ఎన్నుకున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి

ఇల్లెందురూరల్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొమరారం, మర్రిగూడెం, పోలారం గ్రామపంచాయతీలలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం సాధించుకున్న నాటి నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో కాలయాపన చేస్తూ సీఎం కేసీఆర్ పేదలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అరకొరగా మంజూరు చేసి ఎక్కువ మంది పేదలను సొంతింటికి దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇల్లెందులో నిర్వహిస్తున్న ఆందోళనకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పాలకుల విధానాలతో ప్రమాదం

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో దేశంలోని పరిశ్రమలకు, ఆ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రమాదం కానుందని, వాటిని కాపాడుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్దిమంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల దేశంలోని ప్రజలను ఇబ్బంది పెట్టడం దుర్మార్గమని ఆరోపించారు. రాష్ట్ర రెండో మహాసభలు ఈనెల 12,13 తేదీలలో కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎం ఓవర్సీస్ సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యలను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థుల కొరకు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సీఎం ఓవర్సీస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు యండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం రూ.ఐదు లక్షల లోపు కలిగి, గత ఏడాది 2022 ఆగస్టు–డిసెంబర్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులని వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అప్పుల పాలయ్యాం.. ఆదుకోండి

నేడు కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌ల ధర్నా



మాణిక్యారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఏడాది క్రితం వరకు అందుబాటులో ఉన్న నిధులతో పంచాయతీలను అభివృద్ధి బాటలో పయనించారు. ఇదే స్ఫూర్తితో అప్పులు చేసి మరీ పల్లె పాలన ముందుకు సాగించారు. కానీ ఏడాదిగా బిల్లులు మంజూరు కాకపోవడం, తాజాగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు కూడా ఆంక్షలు విధించడంతో పంచాయతీ పాలన కుంటుపడింది. అప్పు తెచ్చి పనులు చేయించిన సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. తమను ఆదుకోవాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీలకు ఆరు నెలలపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదల నిలిపివేశాయి. అందుబాటులో ఉన్న నిధులతో గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు, విద్యుత్ చార్జీలు మాత్రమే చెల్లిస్తూ వచ్చారు. తాజాగా మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కూడా ఆయా ఖర్చులకు మాత్రమే పరిమితం చేశారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణకు వినియోగిస్తున్న ట్రాక్టర్ల డీజిల్ కొనుగోలుకు చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. అంతేకాకుండా రహదారులపై మొరం పోయించడం, పైపులైన్ల మరమ్మతు, వీధిదీపాల నిర్వహణ, సీసీ రోడ్లు వేయించడం, డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, వీధుల వెంట పిచ్చిమొక్కలు తొలగించడం వంటి పనులకు ఖర్చు చేశారు. సీసీ రోడ్లకు కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ముఖం చాటేయాల్సిన దుస్థితి సర్పంచ్‌లకు నెలకొంది.

కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిద్ధం..

గ్రామపాలన సవ్యంగా సాగేందుకు అప్పులు చేసిన సర్పంచ్‌లు వాటిని తీర్చలేక సతమతమవుతున్నారు.

ఈ క్రమంలో మంజూరైన నిధుల నుంచి పెండింగ్ చెక్కులు విడదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా మార్పు కనిపించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా సర్పంచ్‌లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే సర్పంచ్‌ల సంఘాల నాయకులు పలు మండలాల్లో ప్రకటించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తాం



గ్రామపంచాయతీలో ట్రాక్టర్ నిర్వహణ, రహదారుల నిర్మాణం, మొరం పోయించడం వంటి పనులకు అప్పులు చేయాల్సి వచ్చింది. ఏడాదికాలంగా చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించడం లేదు. సమస్యను అధికారులకు వివరించేందుకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తాం.

– సంతు, సర్పంచ్, బోయితండా గ్రామపంచాయతీ

ఆంక్షలు సరికాదు



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సర్పంచ్‌ల హక్కులు హరించడమే. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా డిజిటల్ కీ ని వినియోగించి అధికారులే నిధులు డ్రా చేయడం సరైంది కాదు. డిజిటల్ కీలను సర్పంచ్‌లకు అప్పగించాలి.

– మోకాళ్ల కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం

ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటం


మాట్లాడుతున్న సాధిక్ పాషా

ఇల్లెందు: ప్రభుత్వ కార్యాలయాల్లో అట్టడుగున పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సంక్షేమం కోసం తమ సంఘం అవిశ్రాంతంగా పని చేస్తుందని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కే సాధిక్‌పాషా కార్యదర్శి దినేష్, రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణవేణి అన్నారు. ఆదివారం ఇల్లెందులోని మెయిన్‌రోడ్ హైస్కూల్‌లో జరిగిన సంఘం డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని, అలవెన్సులు, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు సంఘటితం కావాలని తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రెండేళ్లకోసారి సంఘం బలోపేతం కోసం నూతన కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని కోరారు. అనంతరం నూతన డివిజన్ కమిటీ ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎండీ ముస్తఫా, కార్యదర్శిగా గౌస్‌పాషా, ఉపాధ్యక్షుడిగా ఎండీ నయీం, కోశాధికారిగా వినోద్‌కుమార్ కార్యదర్శిగా దేశ్యా, కె.వీరన్న, ప్రచార కార్యదర్శిగా చైతన్య, సహాయ కార్యదర్శిగా శివన్నారాయణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

11నుంచి తిరుపతికి బస్ సర్వీసు

చుంచుపల్లి: ఈ నెల 11 నుంచి తిరుపతికి బస్సు సర్వీసు ప్రారంభించనున్నట్లు కొత్తగూడెం ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు తిరుపతికి రెండు సూపర్ లగ్జరీ బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ బస్సు మొదట మధ్యాహ్నం 2 గంటలకు కొత్తగూడెం నుంచి భద్రాచలం వెళ్లి ఆ తరువాత కొత్తగూడెం మీదుగా తిరుపతికి వెళ్తుందని తెలిపారు. అదే విధంగా రెండో బస్సు సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి నుంచి కొత్తగూడెం బయలుదేరుతుందని పేర్కొన్నారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుల భోజనాలను వ్యతిరేకించండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో రాజ్యాంగ హక్కుల రక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే స్టేషన్ ఆవరణలో సకలజనుల సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కుల భోజనాలు వద్దు.. జన భోజనాలు ముద్దు.. అని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు వివరించారు. కులం పునాదుల మీద ఒక జాతిని గానీ, నీతిని గానీ నిర్మించలేమని, అంబేడ్కర్ చెప్పిన విధానానికి భిన్నంగా రాజకీయ నాయకులు సమాజంలో కులతత్వాలను పెంచి పోషిస్తున్నారన్నారు. రాజకీయ ఉపన్యాసాలలో కులం లేదు.. మతం లేదు.. మనందరం ఒకటే అని ఒకపక్క చెప్తూనే మరో పక్క ఓటును సరుకుగా మార్చి అంగట్లో కులాలను వేలం వేస్తూ అంగడి సరుకుగా మార్చి ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేస్తున్నట్లు చెప్పారు. పనిచేసే దగ్గర, ఈ సమాజానికి సంపద సృష్టించే దగ్గర కలిసిమెలిసి ఉన్న మనుషులు ఒక్కసారిగా నేడు కుల భోజనాల కోసం పరుగులు తీయటం సమాజ పతనానికి కారణం అవుతుందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సకల జనుల సహపంక్తి భోజనాల ద్వారా అన్ని కులాలను, మతాలను చైతన్యం చేస్తూ సమాజానికి ఒక మంచి సందేశం ఇస్తూ ప్రజలలో మార్పును అనుబంధాలను దేశ అభివృద్ధిని పెంచుకోవాలని కోరారు. ఈ సహపంక్తి భోజనం కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మల్లెల రామనాథం, తాళ్లూరి వెంకటేశ్వరరావు, ఖమ్మం నగరానికి చెందిన సామాజిక నాయకులు, స్వర్ణ అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్, ప్రముఖ న్యాయవాది రమేష్ కుమార్ మక్కడ్, సాధినేని వెంకటేశ్వరరావు, అబ్దుల్ బాసిత్, మండవ సుబ్బారావు, మొక్కల వెంకటయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, లగడపాటి రమేష్, గుండపనేని సతీష్, టీచర్ బాలు, జేమ్స్ మునలయ్య, నబీ సాహెబ్, పురుషోత్తం, దేవదానం, కేటీపీఎస్ డీఈ కృష్ణయ్య, బిక్కులాల్, చలి కంటి శ్రీనివాస్, జేబీ శౌరి, దస్తగిరి, మారపాక రమేష్, కూసపాటి శ్రీనివాస్, చారువాక పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలిగా భద్రమ్మ


మాట్లాడుతున్న భద్రమ్మ

ఇల్లెందురూరల్: రేపల్లెవాడ గ్రామపంచాయతీ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా భూక్యా భద్రమ్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ మండల శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని పార్టీ గ్రామపంచాయతీ శాఖ అధ్యక్షుడు సూత్రపు సమ్మయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా భద్రమ్మ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ నిర్మాణాత్మక అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బానోత్ వెంకటేష్, బానోత్ మోహన్, రమేష్, గాజుల వెంకటేశ్వర్లు, సర్పంచ్ అలెం కౌసల్య, ధరావత్ వెంకన్న పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి


ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

పాల్వంచ: మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక బొల్లేరుగూడెం హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. సమష్టి పోరాటాలతో మహిళలు చట్టాలు, హక్కులు సాధించుకోవాలన్నారు. పురుషులతో సమానంగా 50 శాతం రిజర్వేషన్ కావాలని కోరుతున్నా.. పాలకుల మాటలు హామీలకే పరిమితం అవుతున్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా రోజురోజుకి మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేయాలని కోరారు. ముగ్గుల పోటీలు ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తాయన్నారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీక అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, లక్ష్మీకుమారి, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, పద్మజ, రత్నకుమారి, విశ్వేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ధనలక్ష్మీ, నిర్మల, రమేష్, వికాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

డీజీఎంకు సన్మానం


నర్సింహారావును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్ డీజీఎం నర్సింహారావును సింగరేణి ఉద్యోగులు సత్కరించారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న ఆయనను ఏరియా ఇన్‌చార్జ్ ఎస్వీ జి.ఆనంద్, అధికారుల సంఘం ప్రతినిధి పంజాల శ్రీనివాస్, ఏరియా స్టాఫ్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1978 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పాల్వంచ: ఆనందపురం హిల్ రిసార్ట్‌లో 1978 జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి, 1980 ఏపీఎస్ఈబీ జూనియర్ కళాశాల ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 42 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గురువులను సన్మానించుకున్నారు. ప్రస్తుతం అరవై ఏళ్ల వయసులో ఉన్నవారు 16 ఏళ్ల వయసులో గడిపిన జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని కబుర్లు చెప్పుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కాల్వ భాస్కర్, జమాల్ సైదులు, అమర్‌కుమార్, సత్యం బాబు, యాకూబ్ పాషా, ఇంటూరి వెంకటేశ్వరరావు, సుభానీ, పి.వెంకటేశ్వరరావు, రమేష్, సుంద్రరాజన్, ఉషా, రుక్మిణి, పద్మజ పాల్గొన్నారు.

టీఎంఎఫ్ జిల్లా కార్యవర్గం ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ మ్యాథ్స్ ఫోరం నూతన జిల్లా కార్యవర్గం ఎంపిక ఆదివారం జరిగింది. ఈ ఎన్నిక రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఏ.హరి, ఎస్‌కే.ఖాదర్‌లో జూమ్‌లో నిర్వహించినట్లు వివరించారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్.పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఫల్గుణ, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా సురేష్‌కుమార్, కోశాధికారిగా లింగయ్యతో పాటుగా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా హరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మధులు ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాసులకు ఎన్నికైన నూతన సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

టేకులపల్లి: వచ్చే సంక్రాంతి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి మూడు విడతలుగా రావాల్సిన డీఏలను వెంటనే మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు నాలుగేళ్లుగా బదిలీలు, ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేక నష్టపోతున్నారని తెలిపారు. పీఆర్‌సీ 2021 ప్రకారం ఏజెన్సీలో పని చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఎస్‌పీపీ, ఏహెచ్‌ఆర్ఏ జీఓలను వెంటనే విడుదల చేయాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు అన్ని రకాల పోస్టులను మంజూరు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు గ్రేడ్ 1 హెచ్‌డబ్ల్యూఓ, ఏటీడీఓ, డీటీడీఓ, డీడీ పోస్టుల ప్రమోషన్లలో అవకాశం కల్పించాలని, ముంపు మండలాలలో పని చేసిన ఉపాధ్యాయులకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఒక నెల జీతం మొత్తాన్ని ఒకేసారి కాకుండా వాయిదాల రూపంలో తిరిగి రికవరీ చేయాలని తెలిపారు. ఐటీడీఏ భద్రాచలం పరిధిలో పని చేస్తూ ఇన్‌సర్వీస్ బీఈడీ కొరకు ఎన్‌ఓసీకు దరఖాస్తుదారులకు వెంటనే ఎన్‌ఓసీ ఇవ్వాలని, ఐటీడీఏలో ఉపాధ్యాయులకు మౌఖికంగా ఇస్తున్న డిప్యుటేషన్లను నిలిపివేయాలని కోరారు. ఐటీడీఏ పరిధిలో వివిధ కారణాలతో తొలగించబడిన సీఆర్టీలలో కొంతమందిని మాత్రమే తిరిగి తీసుకొని మిగతా వారిని తీసుకోకపోవడం అన్యాయమని మిగిలిన వారందరికీ పోస్టింగులు ఇవ్వాలని తెలిపారు. కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సీపీఎస్‌ను రద్దు చేయాలని విన్నవించారు.

ఐక్యంగా ముందుకెళదాం..


మాట్లాడుతున్న వెంకటముత్యం

కొత్తగూడెంఅర్బన్: మాలల సమగ్ర అభివృద్ధికై అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మేదర వెంకటముత్యం అన్నారు. ఆదివారం పట్టణ పరిధి పాతకొత్తగూడెంలోని అంబేడ్కర్‌నగర్‌లో కొత్తగూడెం మున్సిపాలిటీ మాల మహానాడు ప్రతినిధులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వెంకటముత్యం మాట్లాడుతూ.. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య నాయకత్వంలో హక్కుల సాధనకు, అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలన్నారు. అనంతరం మహిళా అధ్యక్షులు నక్కా సృజన మాట్లాడుతూ.. మాల జాతి మహిళలంతా ఏకతాటిపై నిలిచి మాలల పూర్వ వైభవం, చైతన్యాన్ని చాటాల్సిన అవసరముందన్నారు. అన్ని రంగాలలో ప్రయోజకులుగా నిలువాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు సిరిమల్లె కుమారస్వామి, నాయకులు సబ్బవరపు మధుసూదన్ రావు, పుల్లయ్య, అనిల్, సంజీవరావు, నర్సింహారావు, దేవరాజు, వెంకటమ్మ, సంతోషమ్మ, సుజాత, రాధ, కాసులమ్మ, మంగమ్మ, పద్మ, నాగమణి భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


ధర్నా చేస్తున్న హాస్టల్ వర్కర్లు

ఇల్లెందు: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని హాస్టల్, పీఎంహెచ్‌లో పని చేస్తున్న వర్కర్లు ఖాళీ కంచాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ నుంచి జేకేలోని క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ మాట్లాడుతూ.. డెయిలీవేజ్ వర్కర్లకు ఎనిమిది నెలల వేతనాలు, అవుట్ సోర్సింగ్ వర్కర్‌లకు 22 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

పెంచిన పీఆర్‌సీ వేతనాలు అమలు చేయడం లేదన్నారు. పీఎఫ్‌లో ఉన్న అవకతకలను సరి చేయడం లేదని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, ఏడు నెలలుగా పలుమార్లు ఐటీడీఏ పీఓ, కమిషనర్, గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరినా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. దీంతో గిరిజన ఎమ్మెల్యేల నియోజకవర్గాలను ముట్టిండించి వారి ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఆందోళనలో సీఐటీయూ నేతలు, వర్కర్లు పద్మ, ముత్తయ్య, తాళ్లూరి కృష్ణ, ఈసం పద్మ, జయా, అంజమ్మ, సుబ్రమణ్యం, సమ్మక్క, సుగుణ, సుశీల, లక్ష్మీ, రాజమ్మ, రమ, రజిత, రమణి, జానకి, లక్ష్మణ్‌పాసీ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై కేసు నమోదు


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

సుజాతనగర్: మండల కేంద్రంలోని ఓ ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసుకున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు.. బీఆర్ఎస్ నాయకుడు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్యకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన సుమారు 2 గుంటల ఇంటి స్థలం ఉంది. సదరు స్థలం 2007లో రిజిస్ట్రేషన్ అయింది. ఆ స్థలంలో వీరయ్య కుటుంబసభ్యులు పనిచేస్తుండగా కొల్లి నరేంద్రబాబు, గరుగుల నర్సింహారావు, గరుగుల సత్యనారాయణ, గరుగుల స్వామి, గరుగుల మోహన్‌రావు ఆయుధాలతో వచ్చి దాడి చేసే ప్రయత్నం చేశారని వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సదరు భూమి తనదంటూ కొల్లి నరేంద్రబాబు సైతం పోలీసులకు ఫిర్యాదు అందజేశాడు. బత్తుల వీరయ్య, బత్తుల పుల్లారావు, చల్లా నాగేశ్వరరావు, మక్కళ్ల నరసింహరావు, గొలుసుల నరసింహారావు అనే వ్యక్తులు తన భూమిలోనికి అక్రమంగా ప్రవేశించారని, అక్రమ నిర్మాణాలు చేస్తున్న క్రమంలో తాను అడ్డుకోగా తనపై ఆయుధాలతో దాడి చేసే ప్రయత్నం చేశారని ఫిర్యాదు అందజేశాడు. స్థలం విషయంలో మొదట వివాదం నెలకొనగా గరుగుల గోపాలస్వామి కుటుంబీకులు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. దీంతో పోలీసులు వారికి సర్ది చెప్పి ఆందోళనను శాంతింపజేశారు. అనంతరం ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

పాల్వంచ: ప్రభుత్వం ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్, బి.రాజు, ఉపాధ్యాయదర్శిని సంపాదకులు ఎం.రామాచారి డిమాండ్ చేశారు. పాల్వంచలోని ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు బిల్లుల చెల్లింపులను కేంద్రీకృతం చేసి, ఈ–కుబేర్ ద్వారా చెల్లించడం కుట్ర అన్నారు. ప్రభుత్వం ఆర్థిక దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అవసరాలకు ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో దాచుకున్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐలకు సంబంధించిన లోన్ల తుది చెల్లింపులు కూడా ఆలస్యం చేయడం దారుణమన్నారు. నెల మొదటి వారంలో జీతాలు, పదోన్నతులు, బదిలీలు, ఆరు నెలలకోమారు కరువు భత్యం విడుదల, ప్రతి ఐదేళ్లకోసారి పీఆర్‌సీ వేయడం ఉద్యోగి, ఉపాధ్యాయుల హక్కు అని అన్నారు. ఇప్పటికైనా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని పేరివిజన్ కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జె.రాంబాబు, టి.సత్తిబాబు, వి.సరియా, జిల్లా కార్యదర్శులు బి.రమేష్, జి.భాగ్యలక్ష్మి, ఎస్.కృష్ణబాబు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రాళ్లు ఎగిరి పడుతున్నాయి..

స్థానిక గాయత్రీనగర్ వద్ద రైల్వే వంతెన సమీపంలో బీటీ రహదారిపై ఉన్న కంకర రాళ్లు ద్విచక్రవాహనదారులు, పాదాచారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. రహదారి మరమ్మతులో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కంకర రాళ్లు పైకి తేలి దర్శనమిస్తున్నాయి. ఆర్ఓబీ వంతెన ప్రారంభం నుంచి సుమారు 1500 మీటర్ల వరకు ఈ సమస్య ఉంది. భారీ వాహనాలు వెళుతున్న సమయంలో రాళ్లు ఎగిరి వాహనదారులపైన పడి గాయాలవుతున్నాయని, వెంటనే రోడ్డు నిర్మాణ పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : శివగణేష్, ఆర్అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9440819020